ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 25 మే 2025 | 5





సత్యవాడ గ్రామంలో శానిటేషన్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

# కరోనా.. హైరానా!

## తొలి కేసు నమోదుతో అంతటా ఆందోళన

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

మళ్లీ కొవిడ్ వైరస్ జాడలు వెలుగు చూస్తున్నాయి. దేశ రాజధానితోపాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో కొవిడ్ వైరస్ కేసులు నమోదవుతున్నాయి. ఏపీ ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టరేట్ ఇటీవల కొవిడ్ అప్రమత్తతపై ప్రజలు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులతో కొందరు జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. మళ్లీ కొవిడ్ వ్యాప్తి చెందుతోందన్న వార్తలతో ఏవైనా లక్షణాలు కనిపిస్తే ప్రజలు వెంటనే అప్రమత్తం అవుతున్నారు. ఇప్పటికే కొందరు మాస్కులు పెట్టుకుని తిరుగుతున్నారు. కాగా ప్రార్థనా సమావేశాలు, సామాజిక సమావేశాలు, పార్టీల కార్యక్రమాలు వంటి సామూహిక సమావేశాలను నిలిపివేయాలని హెల్త్ డిపార్టుమెంట్ సైతం ఆదేశించింది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో కొవిడ్ 19 జాగ్రత్తలు పాటించాలని వృద్ధులు, గర్భిణులు ఖచ్చితంగా కొవిడ్ జాగ్రత్తలు తీసుకుంటూ ఇళ్లకే పరిమితం కావాల్సిందిగా సూచించారు. మాస్కులు ధరించాలని సూచించారు. కొవిడ్ 19 లక్షణాలు ఉంటే ముందుగా పరీక్ష చేయించుకుని ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలు పాటించాలని సూచించారు. ఆరోగ్యశాఖ అన్ని పరీక్షా సౌకర్యాలతో కూడిన ల్యాబ్‌లు, మాస్కులు, పీపీఈ కిట్లు, ట్రిపుల్ లేయర్ మాస్కులు తగినంత పరిణామంలో ఆసుపత్రిలో సిద్ధం చేసుకోవాల్సిందిగా సూచనలు చేశారు. కాకినాడ, రాజమహేంద్రవరంలలోని జీజీహెచ్‌లలో ప్రత్యేక వార్డులను ఏర్పాటుచేశారు. కోనసీమ జిల్లా సత్యవాడలో కొవిడ్ కేసు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తం అయ్యారు. జలుబు, జ్వరం ఉన్నవారంతా ఆందోళన చెందుతున్నారు.

- అప్రమత్తమైన అధికారులు
- జిల్లా ఆసుపత్రుల్లో ఐసోలేషన్ వార్డులు



సత్యవాడలో వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

### రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో కొవిడ్ ఐసోలేషన్ వార్డు

రాజమహేంద్రవరం అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో కొవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. సోమవారం నాటికి వార్డు సిద్ధం కావొచ్చని చెబుతున్నారు. ముందుగా 15 బెడ్స్‌తో ఐసోలేషన్ వార్డును సిద్ధం చేసి, అవసరమైతే మరో 15 బెడ్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. పాత మలేరియా అధికారి కార్యాలయం నిర్వహించిన రేకులషెడ్డును కొవిడ్ ఐసోలేషన్ వార్డుగా మార్చాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం షెడ్డులో ఉన్న సామగ్రిని తరలించే కార్యక్రమం చేపట్టారు. బెడ్స్ ఆక్సిజన్, ఇతర వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేసి అందుబాటులోకి తెస్తారు.

### కోనసీమలో తొలి కేసు..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడకు చెందిన వృద్ధుడికి గత మూడు రోజులుగా లోఫీవర్, నిరంతరంగా ముక్కు కారడం వంటి సమస్యలతో బాధపడుతుండడంతో కుటుంబీకులు శుక్రవారం రాత్రి ద్రాక్షారామలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు కొవిడ్ ర్యాపిడ్ కిట్ పరీక్ష నిర్వహించి పాజిటివ్‌గా గుర్తించారు. అనంతరం అతడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించాల్సిందిగా సూచించారు. కుటుంబీకులు శనివారం జీజీహెచ్‌కు తరలించగా స్వాబ్ శాంపిల్‌తో ఆర్‌టీపీసీఆర్ పరీక్ష చేసి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారించారు. అనంతరం అతన్ని ఈఎన్‌టీ విభాగంలో ఏర్పాటుచేసిన కొవిడ్ వార్డుకు తరలించి చికిత్సను అందజేస్తున్నారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ వెల్లడించారు. ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలోనే ఈ ఏడాది ఇదే తొలి కేసు కావడంతో వైద్య వర్గాలన్నీ అప్రమత్తం అయ్యాయి.

### ఆందోళన వద్దు.. అప్రమత్తత అవసరం



కొవిడ్‌తో ఆందోళన వద్దు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సత్యవాడకు చెందిన వృద్ధుడికి కొవిడ్ పాజిటివ్ రావడంపై మంత్రి స్పందించారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తికి తేలికపాటి లక్షణాలు మాత్రమే ఉన్నాయి. జిల్లా వైద్యశాఖ అధికారులు, కాకినాడ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదు.. ధైర్యంగా ఉండాలి. కరోనా లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకుని తగిన వైద్యసేవలు పొందాలి. - **వాసంశెట్టి సుభాష్, మంత్రి**



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న యశ్వంత్ బీమారావు అంబేడ్కర్

## అంబేడ్కర్ బాటలో పయనించాలి

### మనుమడు యశ్వంత్ బీమారావు అంబేడ్కర్

కాట్రేనికోన, మే 24(ఆంధ్రజ్యోతి): అందరూ అంబేడ్కర్ చూపిన బాటలో పయనించాలని అంబేడ్కర్ మనుమడు యశ్వంత్‌బీమారావు అంబేడ్కర్ విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రు బస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని భూపతిరాజు శివకుమార్‌వర్మ (గబ్బర్‌సింగ్) అందించారు. జిల్లాలోనే కూర్చుని ఉన్న విధంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఇక్కడ ఆవిష్కరించారు. ప్రపంచ దేశాల్లో అంబేడ్కర్‌ను ప్రపంచ మేధావిగా గుర్తిస్తుంటే, ఇక్కడ మాత్రం అంబేడ్కర్ విగ్రహాలకు అవమానాలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. అంబేడ్కర్ కల్పించిన ఓటుహక్కును వినియోగించుకుని అట్టడుగు వర్గాల ప్రజలు రాజ్యాధికారం వైపు పయనించాలన్నారు. అనంతరం పలువురు కళాకారులు అంబేడ్కర్ పాటలతో జనాన్ని ఉత్తేజపరిచారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, విగ్రహదాత గబ్బర్‌సింగ్ యశ్వంత్‌బీమారావు అంబేడ్కర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, మాల కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, నాగిడి నాగేశ్వరరావు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, ఆర్పీఐ నాయకులు డీబీ లోక్, ఇసుకపట్ల రవిబాబు, సర్పంచ్ నాతి అలివేణి, యువజన నాయకులు పాల్గొన్నారు.

### సఖినేటిపల్లిలో అత్యధికంగా 20.6 మి.మీ వర్షపాతం

అమలాపురంటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు వర్షం కురిసింది. సగటున 6.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదుకాగా, అత్యధికంగా సఖినేటిపల్లిలో 20.6, అత్యల్పంగా మామిడికుదురులో 1 మిల్లీమీటరు వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురంలో 10.2 మిల్లీమీటర్లు, మండపేట 9.4, రాయవరం 5.2, రామచంద్రపురం, ఖమ్మం, ఆలమూరు 4, రావులపాలెం 10, కొత్తపేట 2.4, కపిలేశ్వరపురం 3.2, కె.గంగవరం 2, ఐ.పోలవరం 7.6, ముమ్మిడివరం 10.4, అయినవిల్లి 8, కె.గంగవరం 4.4, అంబాజీపేట 6.2, రాజోలు6.2, మలికిపురం 4.2, అల్లవరం 6.8, అమలాపురం 7.2, ఉప్పలగుప్తం 4.4, కాట్రేనికోనలో 3.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### పిల్లల కళ్లెదుటే తల్లిదండ్రులు దుర్మరణం

జీవనోపాధికి వచ్చి జీవచ్ఛవాలుగా మిగిలి..

ఇద్దరు బిహార్ యువకుల మృతి

7

# అక్రమాలు.. తవ్వేస్తారు!



నాడు సెల్ఫీ తీసుకున్నారు... నేడు లెక్క తీస్తారు: ఆగస్టు 17 2023న జొన్నాడలో ఇసుక గుట్టల వద్ద సెల్ఫీ తీసుకుంటున్న చంద్రబాబు (ఫైల్‌ఫోటో)

ఇక ఇసుక అక్రమాల వంతు వచ్చింది.. గత వైసీపీ హయాంలో లెక్కలను తవ్వనున్నారు.. నాడు వంద కోట్ల రూపాయల విలువైన ఇసుకను దోపిడీ చేసిన కీలక నేతల గుండెల్లో గుబులు రేగుతోంది.రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమాలపై సిట్‌ను ఏర్పాటు చేస్తూ తీసుకున్న నిర్ణయం గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డ ఇసుక మాఫియా అక్రమాలు వెలుగు చూస్తాయనే ఆందోళన అప్పుడే ప్రారంభమైంది.. నాడు ప్రతిపక్ష నాయకుడి హోదాలో జిల్లా పర్యటనకు హాజరైన చంద్రబాబు ఆలమూరు మండలం జొన్నాడ వద్ద సెల్ఫీ చాలెంజ్ విసిరారు. ఇప్పుడు సీఎం హోదాలో ఆ అక్రమాలను వెలికితీసే పనిలోపడ్డారు..

## ఇసుకాసురుల్లో 'సిట్' గుబులు

- వైసీపీలో ఇసుక దోపిడీపై దర్యాప్తు
- వందల కోట్ల ఇసుక తరలింపు
- ప్రేమ్‌రాజ్ బలవన్మరణంపై ఆరా
- సుప్రీం కోర్టుకు తప్పుడు నివేదిక
- డ్రెడ్జింగ్ మతలబుపైనా కన్ను
- యథేచ్ఛగా సాగిన అక్రమాలు
- ఇష్టానుసారంగా అనుమతులు
- నాడు సహకరించిన అధికారులు

(రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో గోదావరిలో జరిగిన ఇసుక దోపిడీపై సిట్ దర్యాప్తునకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో అప్పటి సర్కారీ పెద్దలతోపాటు ఇసుక దోపిడీలో భాగమైన అధికార, అనధికారుల వెన్నులో వణుకు మొదలైంది. కొవ్వూరు, నిడదవోలు, రాజ మహేంద్రవరం, రూరల్, రాజానగరం, రామచంద్రపురం, మండపేట, కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని ర్యాంపుల నుంచి ఐదేళ్ల కాలంలో వందల కోట్లు విలువైన ఖనిజ సంపద దోచుకుపోయారు. నాడు ఏపీఎండీసీకి అప్పగించినట్టే అప్పగించి వేల కోట్లు దోచుకు న్నారు. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా వందల కోట్ల రూపాయల ఇసుక అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది.నాడు జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో గౌతమి, వశిష్ఠ, వైనతేయ, వృద్ధ గౌతమీ నదీపాయల్లో లభ్యమయ్యే వందల కోట్ల విలువైన ఇసుకను అక్రమంగా దోచేశారు.

### దోపిడీ సాగిందిలా..

ఇసుకలో వైసీపీ దోపిడీ అంతా ఇంతా కాదు.. గోదావరిని జోన్-2, జోన్-3 కింద విభజించి మొదట జేపీ వెంచర్స్‌కు రెండేళ్లకు కాంట్రాక్టు ఇచ్చారు. ఈ సంస్థ ఆన్‌లైన్ లావాదేవీలు చేయకుండా ఒకే ఒక్క బిల్లు బుక్ పట్టుకుని అక్రమంగా లక్షలాది టన్నుల ఇసుకను తరలించేసింది. 2023 మే నెలలో ఈ సంస్థ కాంట్రాక్టు ముగియడంతో వారిని పక్కన పెట్టి అప్పటి వైసీపీ సర్కారీ పెద్దలు తెరమీదకు వచ్చారు. జేపీ సంస్థ వాడిన బిల్లులనే చూపిస్తూ అనధికారికంగా మరింత బరితెగించిన సంగతి తెలిసిందే. వీరు ఏకంగా ర్యాంపులన్నింటికీ ఒకే వ్యక్తికి అప్పగించి నెలకు సుమారు రూ.30 కోట్ల వరకూ చెల్లించేలా ఒప్పందం పెట్టుకున్నారు. ఇసుక తవ్వకముందే వారికి డబ్బు ఇచ్చేటట్టు లోపాయికారి ఒప్పందం జరిగింది. కొవ్వూరు డివిజన్‌లోని ర్యాంపులను కొవ్వూరుకు చెందిన వైసీపీ నేత ప్రేమ్‌రాజ్ దక్కించుకుని అప్పుల పాలయ్యాడు. అనంతరం ప్రేమ్‌రాజ్ కొవ్వూరులో రైల్వే పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసు దర్యాప్తు పూర్తి చేయనీయలేదు. తాడేపల్లి నుంచి కొందరు పెద్దలు పంపిన వ్యక్తులు వచ్చి ప్రేమ్‌రాజ్ కేసును మూయించేసినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. ఇవాళ సిట్‌ని నియమించడంతో ఈ కేసును పూర్తిగా దర్యాప్తు చేస్తే ఇసుక కుంభకోణాల డొంక కదలక తప్పదు. రాజమహేంద్రవరం వైపు ఆర్‌కే అనే వ్యక్తి మొత్తం ర్యాంపులను తీసుకుని సర్కారుకు కప్పం చెల్లించిన సంగతి తెలిసిందే. ఇందులో కొన్ని కుంభకోణాలు కోర్టు వరకూ వెళ్లడంతో సుప్రీంకోర్టు విచారణకు ఆదేశించింది. దీనిపై అప్పటి జిల్లా కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్‌తో కూడా తప్పుడు రిపోర్టు ఇప్పించినట్టు ప్రచారం జరిగింది. గోదావరిలో అక్రమాలపై ధవళేశ్వరం గ్రామానికి చెందిన వంశీ అనే ఇసుక వ్యాపారి కోర్టును ఆశ్రయించడంతో ఎస్పీ ఆఫీసుకు అతన్ని పిలిపించి అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు చుట్టుముట్టి అతని చేత బలవంతంగా ఫిర్యాదు వెనక్కి తీయించడం అప్పట్లో సంచలనమైంది. ఇదంతా తాడేపల్లి పెద్దల ఒత్తిడితోనే జరిగినట్టు ప్రచారం జరిగింది.

### నాడు చంద్రబాబు సెల్ఫీ చాలెంజ్

2023ఆగస్టు 17న జొన్నాడలో ఉన్న ఇసుక గుట్టలను చంద్రబాబునాయుడు సందర్శించారు. కోనసీమ పర్యటనలో భాగంగా అప్పటి వైసీపీ ఎమ్మెల్యేల పేర్లను ప్రస్తావిస్తూ ఇసుక దోపిడీలో ఎన్ని వందల కోట్లు దోచుకున్నారో లెక్కలతో సహా ఆరోపణాస్త్రాలు సంధించారు. అప్పటి వైసీపీ ప్రభుత్వానికి సెల్ఫీ చాలెంజ్ చేశారు. ఇసుక దోపిడీలో నాటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కీలక పాత్ర వహించినట్టు తేల్చారు. ఇప్పుడు సీఎం హోదాలో లెక్క తేల్చనున్నారు.

### కోర్టును తప్పుదారి పట్టించి..

ఇసుక కుంభకోణాలు, అక్రమాలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తంచేయడంతో ఇక్కడ అసలు డ్రెడ్జింగ్ అక్రమాలు జరగలేదని, నిబంధనలు ఎవరూ ధిక్కరించలేదని ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సంస్థ పేరునే డ్రెడ్జింగ్ జరిగినట్టు ఓ బూటకపు నాటకాన్ని తెరమీదకు తేవడం కూడా చాలామందికి తెలిసే ఉంటుంది. అప్పట్లో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాతేరు శివారు వెంకటనగర్ వరకూ, కొవ్వూరు డివిజన్‌లోనూ రాత్రీ పగలూ అనధికారికంగా డ్రెడ్జింగ్ జరిగిన సంగతి తెలిసిందే. 2023 మే నెల నుంచి వందలాది డ్రెడ్జింగ్ పడవలతో ఇసుక దోపిడీ జరిగింది. 2023 డిసెంబర్‌లో ప్రతిమ సంస్థ పేరుతో రంగంలోకి దిగి డ్రెడ్జింగ్ చేశారు. దీనిని పక్కదారి పట్టించడానికి గతంలో డ్రెడ్జింగ్‌కు అనుమతి పొందినా ఇసుక తీయని సంస్థను తెరమీదకు తెచ్చి నాటకాలాడారు. ఇందులో బోట్స్‌మన్ సొసైటీలను భాగస్వామ్యం చేశారు. ఇలా కోర్టును తప్పుదారి పట్టించడమే కాకుండా రూ.వందల కోట్లు బిల్లులు ఇవ్వాలని తర్వాత ప్రభుత్వానికి బిల్లులు పెట్టడం గమనార్హం. దీనికి అప్పటి మైన్స్ ఇరిగేషన్ అధికారులు సహకరించడం, జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తేవడం అందరికీ తెలిసిందే. నాడు బ్రిడ్జిల పక్క నా తవ్వేశారు. ధవళేశ్వరం బ్యారేజి, రోడ్ కం రైలు బ్రిడ్జి, గామన్ వంతెన, హేవలాక్ బ్రిడ్జి ప్రాంతాల్లోనూ యథేచ్ఛగా తవ్వేశారు. గనులు, భూగర్భశాఖకు చెందిన యంత్రాంగం అప్పటి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే పనిచేసింది. మైన్స్ అధికారులు ఎన్ని అక్రమాలు జరిగినా పట్టించుకోలేదు.

### వైసీపీలో సిట్ గుబులు..

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఎక్కడ ఎంత మేర ఇసుక దోపిడీ జరిగింది. నాటి ప్రభుత్వానికి ఎంత ఆదాయం వచ్చిందనే అంశంపై లెక్కలు తేల్చి బాధ్యులను గుర్తించేందుకు పోలీసు అధికారులతో ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసింది. ఇదిలా ఉండగా కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి స్వగ్రామమైన గోపాలపురంలో శనివారం వైసీపీ కోఆర్డినేటర్లు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో విందు సమావేశాన్ని నిర్వహించారు. సరిగా అదే సమయానికి ఇసుక అక్రమాలపై సిట్ ఏర్పాటు చేశారన్న సమాచారం తెలుసుకున్న కొందరు నాయకులు ప్రాథమికంగా చర్చించుకున్నట్టు తెలిసింది. మొత్తం మీద జిల్లాలో దోపిడీపై సిట్ ఏర్పాటు అన్న సమాచారం అటు అప్పటి వైసీపీ ప్రతినిధులు, అప్పట్లో కీలకంగా పనిచేసిన పలు శాఖల అధికారుల్లో గుబులు రేపుతోంది.



బాలయోగి స్టేడియంలో మాస్టర్ ట్రైనీల శిక్షణలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

## స్వర్ణాంధ్ర సహకారానికి యోగాంధ్ర మాసోత్సవాలు

### జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ స్ఫూర్తితో ఆరోగ్యకరమైన స్వర్ణాంధ్ర కోసం యోగాంధ్ర మాసోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతీ వర్గం సమష్టి భాగస్వామ్యంతో మాసోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. శనివారం అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో రెండు రోజులపాటు వంద మంది మాస్టర్ ట్రైనీలకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని తొలిరోజు ఆమె ప్రారంభించారు. యోగాంధ్ర మాసోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యోగా నేర్చుకునేందుకు ట్రైనర్ల సేవలను ఉపయోగించుకోవాలన్నారు. వార్డు, గ్రామ సచివాలయ పరిధిలో ట్రైనర్లు అందుబాటులో ఉంటారని, ఒక్కో ట్రైనర్ సెషన్‌కు 50 మంది చొప్పున యోగాభ్యాసం చేయించనున్నట్టు వెల్లడించారు. యోగాంధ్ర నిర్వహణలో జిల్లాను ఆదర్శవంతంగా నిలిపేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ ఏడాది విశాఖలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా వేడుకలకు జూన్ 21న ప్రధాని నరేంద్రమోదీ హాజరు కానున్నట్టు తెలిపారు. భారతీయ వారసత్వ, సాంస్కృతిక సంపద అయిన యోగాను ప్రతీ ఒక్కరు ఆచరించి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేలా ప్రోత్సహించనున్నట్టు ఆమె తెలిపారు. విద్యార్థులు, మాజీ సైనికులు, డ్వాక్రా మహిళలు, ఉపాధ్యాయులు, సీనియర్ సిటిజన్లు, స్వాతంత్ర్య సమరయోధులు, సెలబ్రిటీలతోపాటు వివిధ వర్గాల వారితో రోజువారీగా కామన్ యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ నాగేశ్వరరావు, జిల్లా ఆయుష్ వైద్యాధికారి విజయకుమారి, యోగా ట్రైనర్లు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

### నేడూ విద్యుత్ బిల్లుల వసూళ్లు

అమలాపురంటౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లుల వసూళ్ల కౌంటర్లు ఆదివారం సెలవురోజున కూడా యథావిధిగా పనిచేస్తాయని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సిద్దెల రాజబాబు తెలిపారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లులు చెల్లించాలని కోరారు. విద్యుత్‌శాఖ రెవెన్యూ కార్యాలయాలతోపాటు ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ ఆఫీస్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో కూడా ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు.

## వారధికి పొంచి ఉన్న ప్రమాదం

### రూ.18 కోట్లతో ప్రతిపాదనలు







వివేకానంద వారధి.. వారధి వద్ద లంకభూమి కోతకు గురవుతున్న దృశ్యం

ముమ్మిడివరం, మే 24 (ఆంధ్రజ్యోతి): లంకవాసులకు రోడ్డు రవాణా మార్గాలు కల్పించేందుకు గౌతమీ గోదావరి నదీపాయపై రామకృష్ణ మిషన్‌వారు నిర్మించిన వివేకానంద వారధికి ముప్పు పొంచి ఉంది. వరదనీటి ప్రవాహ వేగానికి వివేకానంద వారధి లంకాఫ్ ఠాణేలంకవైపు లంకభూమి కోతకు గురవుతోంది. దీంతో ఆ వారధికి ప్రమాదం పొంచి ఉంది. లంకవైపు పిల్లర్ వద్ద 20 మీటర్ల వెడల్పున, 50 మీటర్ల పొడవునా భూమి కోతకు గురైంది. ఇక్కడ భూమి మరికొంతమేర కోతకు గురైతే వారధి పిల్లర్ దెబ్బతిని వారధి మనుగడకే ప్రమాదం వాటిల్లనుంది. 1996లో సంభవించిన పెనుతుఫాన్ తాకిడికి ముమ్మిడివరం, అయినవిల్లి మండలాల్లో లంక గ్రామాలు అతలాకుతలమయ్యాయి. ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లింది. ఆ సమయంలో ఆపన్నులకు సేవలు అందించేందుకు ఈ ప్రాంతానికి వచ్చిన రామకృష్ణ మిషన్‌వారు లంక వాసులకు రోడ్డు నిర్మాణం కల్పించేందుకు వారధి నిర్మాణం చేపట్టారు. 1998-99లో రూ.3.25 కోట్లతో వారధిని నిర్మింపజేశారు. దీంతో ముమ్మిడివరం మండలంలోని లంక గ్రామాలు, లంకాఫ్ ఠాణేలంక, కూనాలంక, గురజాపులంక, అయినవిల్లి మండలంలోని యలకల్లంక, గుణ్ణంమెరక గ్రామాలకు సంబంధించి సుమారు 8 వేల మంది ప్రజల రాకపోకలకు రోడ్డు మార్గం ఏర్పడింది. కానీ ఆ తరువాత గోదావరి వరదలు వచ్చినప్పుడల్లా నదీ ప్రవాహానికి భూమి కోతకు గురవుతోంది. దీంతో కోతకు గురవుతున్న ప్రాంతంలో రక్షణ చర్యలు చేపట్టేందుకు ఆయిల్ ఇండియా కంపెనీ రూ.కోటి 20లక్షలతో ప్రతిపాదనలు రూపొందించినా కార్యరూపం దాల్చలేదు. 2023లో ఆగస్టు నెలలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి లంక గ్రామాల నదీకోత నివారణకు 3 కిలోమీటర్ల మేర రక్షణచర్యలకు రూ.150 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఈ ప్యాకేజీలో వివేకానంద వారధి వద్ద సుమారు 300 మీటర్ల మేర రక్షణ చర్యలకు రివిట్‌మెంట్ పనులకు ప్రతిపాదనలు రూపొందించినా అవి కార్యరూపం దాల్చలేదు. దీంతో వారధి రక్షణ చర్యలు చేపట్టేందుకు రూ.18 కోట్లతో ప్రతిపాదనలు తాజాగా రూపొందించారు. వారధి వద్ద రూ.300 మీటర్ల మేర పిచ్చింగ్, రివిట్‌మెంట్ వంటివి చేపట్టేందుకు వీలుగా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. అవి కార్యరూపం దాల్చితే సమస్య పరిష్కారమవుతుంది. నిధుల మంజూరుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సి ఉంది.

# మిల్క్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆటో

## ఆటో డ్రైవర్ మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మరణించిన వరప్రసాద్‌కుమార్



మిల్క్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆటో

గొల్లప్రోలు, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్ పరిధి 216 జాతీయ రహదారిపై మిల్క్ ట్యాంకర్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ మరణించగా, మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మేడిది ధర్మేంద్ర వరప్రసాద్‌కుమార్(34) అలియాస్ నాని, అదే గ్రామానికి చెందిన బి.లోవకుమారి అనే సత్యవతి ఆటోలో పిఠాపురం వస్తున్నారు. గొల్లప్రోలు టోల్‌ప్లాజా దాటిన తర్వాత కత్తిపూడి నుంచి పిఠాపురం వైపు ముందు వెళ్తున్న పాల ట్యాంకర్ సడన్‌బ్రేక్ వేయడంతో పాటు వెనుకనే వస్తున్న ఆటో ఢీకొంది. ప్రమాదంలో వరప్రసాద్ కుమార్ మరణించగా, లోవకుమారికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 'మూకుమ్మడి ఆత్మహత్యలకు పాల్పడతాం'



గోర్సలో తమ భూముల జోలికి రావద్దని హెచ్చరిస్తున్న రైతులు

కొత్తపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం గోర్స గ్రామంలో సర్వే నెం.121, 122ల్లో సుమారు 24 ఎకరాల భూమిని దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే మూకుమ్మడి ఆత్మహత్యలకు పాల్పడతామని రైతులు హెచ్చరించారు. గోర్సలో సీతారామస్వామి ఆలయ భూములని చెప్తున్న భూములన్నీ తమ పేరునే ఉన్నాయన్నారు. అయితే అవి దేవాలయ భూములంటూ స్వాధీనం చేసుకుంటామని అధికారులు హెచ్చరించడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా ఈ భూములు తమ స్వాధీనంలో ఉన్నాయని, వాటికి పన్నులు కూడా చెల్లిస్తున్నామన్నారు. తమ పేరున ఉన్న భూములను కుమార్తెలకు కట్నకానుకలుగా ఇచ్చి పెళ్లిళ్లు చేశామన్నారు. మిగిలిన భూములపై వచ్చే ఆదాయంతో జీవనోపాధి పొందుతున్నామన్నారు. ఇప్పుడా భూములను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవాలని చూస్తే ఆత్మహత్యలకు పాల్పడడమే శరణ్యమని వారు హెచ్చరించారు.

గోర్స సీతారామస్వామి ఆలయ భూములను స్వాధీనం చేసుకుంటామని అధికారులు మోసం చేశారని సర్పంచ్ రొంగల వీరబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆరోపించారు. సర్వే నెం.121, 122ల్లో గల భూములను శనివారం రైతుల నుంచి స్వాధీనం చేసుకుంటామని దేవదాయ శాఖ అధికారులు గ్రామస్తులు, ప్రజలకు సమాచారం ఇచ్చారన్నారు. ఈ క్రమంలో ఆసుపత్రికి తరలించేం దుకు అంబులెన్స్‌లను సిద్ధం చేశారన్నారు. అయితే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఏ అధికారీ గోర్స వచ్చిన దాఖలాలు లేవన్నారు. ఏ సమాచారం ఇవ్వకుండా తమను మోసం చేశారని, ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మరణించిన సుంకర రాజు

జగ్గంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటలో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన సుంకర రాజు(35) 10 ఏళ్లుగా జగ్గంపేటలో నివాసం ఉంటున్నాడు. బాలాజీనగర్‌లో ఓ ఇంట్లో వారం రోజుల నుంచి తాపీ పని చేస్తుండగా శనివారం స్లాబ్ నిమిత్తం సెంట్రింగ్ వేస్తుండగా వర్షం పడడంతో విద్యుత్ షాక్ కొట్టడంతో కింద పడిపోయాడు. దీంతో స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రఘునందరావు తెలిపారు.

## పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

తుని రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం తలుపులమ్మ లోవ దేవస్థానం పరిసర ప్రాంతాలైన ప్రైవేట్ వసతి గృహాలు, సమీప మామిడి తోటల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3800 నగదు స్వాధీనపరుచుకున్నట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురి అరెస్టు

తాళ్లరేవు, మే 24 (ఆంధ్రజ్యోతి): యానాం నుంచి మద్యాన్ని అక్రమంగా ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ కోటేశ్వర్ శనివారం తెలిపారు. డిప్యూటీ కమిషనర్ వై.చైతన్యమురళీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఎక్సైజ్ అధికారులు కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు ఎక్సైజ్ చెక్ పోస్టు వద్ద జరిపిన దాడుల్లో నలుగురు పట్టుబడ్డారు. వారి నుంచి 2 కార్లు, ఒక మోటారుసైకిల్, 50మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్టు సీఐ తెలిపారు. దాడుల్లో సీఐతో పాటు ఎస్ఐ నాగేంద్రకృష్ణ తదితరులు ఉన్నారు.

## ఈఏపీసెట్ ఇంజనీరింగ్ పరీక్షకు 2,202 మంది హాజరు

### కన్వీనర్ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్-2025 ఇంజనీరింగ్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష శనివారం కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగిందని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. మూడు జిల్లాల్లోని తొమ్మిది కేంద్రాల్లో ఉదయం 9నుంచి 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు మొత్తం 2,296 మంది విద్యార్థులకు 2,202 మంది హాజరుకాగా 94 మంది గైర్హాజరయ్యారు. కాకినాడ జిల్లాలో 95.67శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 96.17 శాతం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 95.78 శాతం హాజరు నమోదైంది. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు ఆదివారం కూడా కొనసాగుతాయి. ఏపీ ఇంటర్ రెగ్యులర్ విద్యార్థులు మినహా సీబీఎస్, ఐసీఎస్ఈ, ఏపీవోఎస్ఎస్, ఎన్ఐవోఎస్, డిప్లొమా, ఇతర బోర్డులకు చెందిన విద్యార్థులు తమ ఇంటర్ మార్కులను ఏపీఈఏపీసెట్ https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా డిక్లరేషన్ ఫారంలో ఈనెల 30వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని కన్వీనర్ సూచించారు.

# పిల్లల కళ్లెదుటే తల్లిదండ్రులు దుర్మరణం

## లారీ రూపంలో మృత్యువు

### తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ఘటన

### గోకవరం మండలం గోపాలపురంలో విషాదఛాయలు



ఘటనా స్థలంలో దుర్గాప్రసాద్, సిరి మృతదేహాలు





దుర్గాప్రసాద్, సిరి దంపతుల ఫైల్‌ఫొటోలు



పోలీస్‌స్టేషన్ వద్ద విలపిస్తున్న చిన్నారులు

దేవరపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): పిల్లలు కాలకృత్యాల కోసం ద్విచక్రవాహనాన్ని రోడ్డుపక్కన ఆపిన తల్లిదండ్రులను మృత్యువు లారీ రూపంలో కబళించింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందిన హృదయ విదారకర ఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి డైమండ్ జంక్షన్ సమీపంలో శనివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి.. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన తొంటా దుర్గాప్రసాద్ (32), తొంటా సిరి (29) భార్యభర్తలు. వారికి 11ఏళ్ల కుమార్తె ప్రవల్లిక, 9ఏళ్ల కుమారుడు ఇమ్మానుయేల్ ఉన్నారు. దుర్గాప్రసాద్ తాపీ మేస్త్రీగా, అతడి భార్య సిరి అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. దుర్గాప్రసాద్ అన్నయ్య తొంటా మునలయ్య దేవరపల్లి మండలం యాద వోలులో ఉండడంతో సెలవులు వచ్చినప్పుడల్లా ఇక్కడికి వస్తుంటారు. దానిలో భాగంగా శనివారం గోపాలపురం నుంచి యాదవోలు బయల్దేరారు. మార్గమధ్యంలో దేవరపల్లి డైమండ్ జంక్షన్‌కు వచ్చేసరికి పిల్లలకు టాయిలెట్స్ నిమిత్తం వాహనాన్ని రోడ్డుపక్కన ఆపారు. ఈ క్రమంలో దుర్గాప్రసాద్, అతడి భార్య బండి వద్ద నిల్చొని తన వెంట తెచ్చుకున్న మామిడికాయల సంచిను సరిచేస్తుండగా రాజమండ్రి వైపు నుంచి ఏలూరు వైపు వెళ్తున్న లారీ అతివేగంతో ఢీ కొని వారిపై నుంచి దూసుకెళ్లడంతో అక్కడి కక్కడే మృతిచెందారు. పిల్లల కళ్ల ముందే ఈ ఘోర సంఘటన జరగడంతో వారితో పాటు బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనా స్థలాన్ని సీఐ నాగేశ్వర్‌నాయక్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. మృతదేహాలను గోపాలపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఈ ఘటనకు కారణమైన లారీ డ్రైవర్ చర్లపల్లికి చెందిన శ్రీశైలంనుపోలీసులు అరెస్ట్ చేశారు.

# విద్యుదాఘాతానికి ముగ్గురు బలి

### విజయవాడలో దుర్ఘటన

### మృతుల్లో ఇద్దరు రాజమండ్రి వాసులు



ఘటనాస్థలిలో మృతదేహాలు

విజయవాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతం ముగ్గురిని బలి తీసుకుంది. ఒకరిని కాపాడేందుకు మరొకరు ప్రయత్నించి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన విజయవాడలోని బెంజిసర్కిల్ సమీపాన ఉన్న నారా చంద్రబాబు నాయుడు కాలనీలో శనివారం జరిగింది. విజయవాడకు చెందిన పెరవళి రామకనక దుర్గాప్రసాద్ ఐటీఐ విశ్రాంత ప్రిన్సిపాల్. ఆయన పేరున నారా చంద్రబాబు నాయుడు కాలనీలో సాయి టవర్స్ జీఎఫ్2 ఫ్లాట్ ఉంది. ఇందులో ఆయన సతీమణి పెరవళి ముత్యావలి ఉంటున్నారు. అయితే కొన్నాళ్లక్రితం ఇద్దరూ విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. ఈ ఫ్లాట్‌లో మాత్రం ముత్యావలి నివసిస్తున్నారు. దుర్గాప్రసాద్ చేసిన అప్పులు తీర్చకపోవడంతో ఇంటిని కోర్టు జప్తు చేసింది. ఈ ఫ్లాట్‌ను ఖాళీ చేయాలని అడ్వకేట్ కమిషన్ ఈనెల 16న నోటీసు అంటించింది. ఈ ఫ్లాట్‌లో ముత్యావలి ఉం టుండగా, దుర్గాప్రసాద్ పెన మలూరు మండలం పోరంకిలో వేరుగా ఉంటున్నారు. ఇంటిని ఖాళీ చేయాల్సి రావడంతో ముత్యావలి అన్నయ్య తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన సలాది ప్రసాద్, ఆయన సతీమణి ఊటుకూరి రాధ కొద్దిరోజుల క్రితం ఇక్కడికి వచ్చారు. ఫ్లాట్ ఖాళీ చేయాల్సి రావడంతో సామాన్లు పార్శిల్ చేసుకున్నారు. శనివారం ఉదయం ప్రసాద్ కుళాయి వద్ద దుస్తులు ఉతుకుతుండగా, ఆయన సోదరి ముత్యావలి తీగపై ఆరేస్తుంది. గుమ్మం ఎదురుగా ఉన్న జియో తీగపై దుస్తులు వేస్తుండగా, విద్యుదాఘాతానికి గురైంది. కుళాయి వద్ద ఉన్న ప్రసాద్ పక్కనే ఉన్న వాచ్‌మెన్ కుమార్తె ప్రభావతిని పిలిచాడు. ఆమె పైఅంతస్తులో ఉన్నవారిని పిలవడానికి వెళ్లింది. ఇంతలో ప్రసాద్ తన సోదరిని కాపాడుకునేందుకు తడి చేతులతో పట్టుకోవడంతో ఆయన కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. భర్త ప్రసాద్ పెద్దగా కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న భార్య రాధ కూడా ఆయన్ను రక్షించే ప్రయత్నం చేయడంతో ఆమెకు కూడా షాక్ తగిలింది. గుమ్మానికి ఎదురుగా ముత్యావలి, ప్రసాద్ పడిపోగా, కొద్దిదూరంలో రాధ పడిపోయింది. కేకలు విని చుట్టుపక్కల వారు వచ్చి వెంటనే ఫ్యూజులు లాగేశారు. అప్పటికే ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలాన్ని అడ్మిన్ డీసీపీ కేజీవీ సరిత, సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదర్, పటమట ఇన్‌స్పెక్టర్ వి.పవన్‌కిషోర్ పరిశీలించారు. విద్యుత్‌శాఖ సిబ్బంది ఘటనాస్థలాన్ని తనిఖీ చేశారు.

# జీవనోపాధికి వచ్చి జీవచ్ఛవాలుగా మిగిలి..

## ఇద్దరు బిహార్ యువకుల మృతి

### 2 మైనింగ్ లారీలు ఢీకొనడంతో ప్రమాదం

### కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో ఘటన





ప్రమాదంలో మృతిచెందిన బిహార్ యువకులు

ప్రత్తిపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వంతాడ లేటరైట్ మైనింగ్ కొండ వద్ద శనివారం రాత్రి రెండు మైనింగ్ లారీలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందారు. వారిని బిహార్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని వంతాడ లేటరైట్ మైనింగ్ పనుల్లో బీహార్ రాష్ట్రానికి చెందిన ధీరజ్‌కుమార్ (23), చందన్‌కుమార్ (21) పని చేస్తున్నారు. వారిద్దరూ శనివారం రాత్రి విధులు ముగించుకుని కొండపై నుంచి కిందకు వచ్చే మైనింగ్ లారీలో ప్రయాణిస్తున్నారు. అలాగే కొండ దిగువ నుంచి కొండపైకి వెళ్తున్న మరో మైనింగ్ లారీ పరస్పరం కొండ దిగువన గల యార్డు సమీపంలో ఢీకొన్నాయి. లారీలు నుజ్జునుజ్జు అయ్యాయి. పైనుంచి వస్తున్న లారీలో ఉన్న ధీరజ్‌కుమార్, చందన్‌కుమార్ మృతిచెందారు. వారి మృతదేహాలను శనివారం రాత్రి పది గంటల సమయంలో పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారని సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్యమైఖేల్ తెలిపారు. ప్రత్తిపాడు ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జీవనోపాధి కోసం బిహార్ నుంచి వచ్చిన వారు మృతి చెందడంతో స్థానికంగా విషాదం అలముకుంది.



నుజ్జునుజ్జయిన లారీ

## తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకి

# ఎస్ఎంసీ చైర్మన్ ఆత్మహత్యాయత్నం



కొలిశెట్టి సత్యం (ఫైల్ ఫొటో)



దూకిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కరప, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడి వంతెన పైనుంచి ఒక వ్యక్తి తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి... కాజులూరు మండలం గొల్లపాలేనికి చెందిన కొలిశెట్టి సత్యం (42) స్థానికంగా విజయభవాని పలావు సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గొల్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచిన సత్యం చైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆయనకు భార్యతో పాటు టెన్త్, ఇంటర్ చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం రాత్రి సత్యం గొర్రిపూడి వంతెన వద్దకు వచ్చి చెప్పులు విడిచి ఒక్కసారిగా తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకేశాడు. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే స్పందించి కరప పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ తోట సునీత ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. చీకటి పడడంతో లైట్లను ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక మత్స్యకారులు బోట్లపై నుంచి వలలు విసిరి సత్యం ఆచూకీ కోసం ప్రయత్నించారు. కాకినాడ జగన్నాయక్‌పూర్ ఫైర్ స్టేషన్ నుంచి సిబ్బంది వచ్చి తుల్యభాగ డ్రెయిన్లో విస్తృతంగా గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో పాటు చీకటి పడడంతో ఆదివారం ఉదయం రెస్క్యూ టీమ్ సహాయంతో మరలా గాలింపు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు. భార్యభర్తల మధ్య తలెత్తిన గొడవ కారణంగా సత్యం క్షణికావేశంలో డ్రెయిన్ లోకి దూకేసినట్టు స్థానికులు భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు.

## హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లొమాలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

### కాకినాడ చేనేత, జౌళి శాఖ అధికారి

కార్పొరేషన్ (కాకినాడ), మే 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమా కోర్సులో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కాకినాడ జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి కె.పెద్దిరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిప్లొమా కోర్సులో శిక్షణఇచ్చి కేంద్ర ప్రభుత్వ జౌళిశాఖ ద్వారా సర్టిఫికెట్ జారీ చేస్తామని తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు వారి మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారన్నారు. ఇంటర్ ఎంపీసీ, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు నేరుగా రెండు సంవత్సరంలో చేరవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల మేరకు నెలకు రూ.2,500 స్టైఫండ్ పొందేందుకు అర్హులని తెలిపారు. క్యాంపస్ సెలక్షన్స్ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఈకోర్సుచేసిన తర్వాత బీటెక్ రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశించవచ్చన్నారు. వివరాలకు కాలేజీ వైబ్‌సైట్‌ను, 9866169908, 901024 3054ను సంప్రదించవచ్చన్నారు. దరఖాస్తుల స్వీకరణకు జూన్ 1 ఆఖరి తేదీ అని ఆయన తెలిపారు.

# ఇదేమి 'పని'తనం!

## పనిచేస్తున్న ఇళ్లకే కన్నం వేసిన పని మనుషులు

- కాకినాడలో మహిళ అరెస్ట్
- 22 కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువుల స్వాధీనం
- సామర్లకోటలో రూ.6 లక్షల విలువైన బంగారు ఆభరణాలతో మహిళ అరెస్ట్

కాకినాడ క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా ఓ ఇంట్లో పని చేస్తూ యజమానురాలు లేని సమయంలో ఆ ఇంటిని కొల్లగొట్టిన పని మనిషి కాకినాడ టూటౌన్ పోలీసులకు దొరికిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి... కాకినాడ విద్యుత్‌నగర్ ఎస్‌బీఐ కాలనీలో నివసిస్తున్న వి.మణి కలెక్టరేట్ ప్రాంగణంలోని వికాస సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తోంది. ఆమె శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఇంటికి తాళం వేసి విధులకు హాజరై సాయం త్రం 5.30 గంట లకు వచ్చింది. బీరువాలో ఉన్న 22 కాసుల బంగారు ఆభరణాలు, ఇతర వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించి వెంటనే టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మణి ఆఫీసుకు వెళ్లేటప్పుడు ఒకచోట తాళం పెట్టి వెళ్తుంది. ఇది తెలిసిన పని మనిషి రమ్య యజ మాని వెళ్లగానే ఆ తాళం తీసుకుని ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను తీసుకుని ఉడాయించింది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు రమ్యను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. తానే ఆభరణాలను దొంగిలించినట్టు ఒప్పుకోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని మణికి అప్పగించారు. కేసును ఛేదించిన సీఐ అప్పలనాయుడు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

### సామర్లకోటలో....

సామర్లకోట, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో సింగవరపు సత్యనారాయణ ఇంటిలో ఇటీవల జరిగిన చోరీ సంఘటనలో సామర్లకోట పోలీసులు దర్యాప్తు మేరకు ఇంటిలో పనిచేస్తున్న వీర్రాఘవపురానికి చెందిన బొడ్డు దుర్గాదేవిని విచారించగా చోరీకి గురైన రూ.6 లక్షల విలువైన బంగారపు ఆభరణాలు, 17 చిన్న డైమండ్స్, స్మార్ట్ వాచ్‌ను స్వాధీనం చేసుకున్నట్టు శనివారం రాత్రి సీఐ కృష్ణభగవాన్ విలేకర్లకు తెలిపారు. అంబటి వారి తోటలోని సత్యనారాయణ ఇంటిలో జరిగిన ఈ చోరీపై సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తు చేశారు. ఇంటిలోనే పనిమనిషిగా పని చేస్తున్న దుర్గాదేవిని అనుమానించి పోలీసులు తమదైన కోణంలో దర్యాప్తు నిర్వహించడంతో తానే చోరీకి పాల్పడినట్లు అంగీకరించడమే గాక ఆమె ఇంటిలో దాచి ఉంచిన ఆభరణాలు తదిత ర చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. కాగా దుర్గాదేవిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టు ఎదుట హాజరుపర్చనున్నట్టు సీఐ తెలిపారు. ప్రతీ ఇంటి యజమానులు ఇల్లు విడిచి వేరే ప్రాంతాలకు వెళ్లినపుడు ఎల్‌హెచ్ఎంఎస్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. అలాగే ఇంటిలో పనిమనుషులను పెట్టుకున్న ప్పుడు వారి కదలికలపై నిఘా ఉంచాలని తెలిపారు.



కాకినాడ జిల్లా సామర్లకోటలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణభగవాన్

# రత్నగిరిపై భక్తుల సందడి

### రూ.50 లక్షల ఆదాయం

అన్నవరం, మే 24 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధి శనివారం భక్తులతో పోటెత్తింది. వైశాఖమాసం వివాహ ముహూర్తాల్లో శుక్రవారం చివరి ముహూర్తం కావడంతో సత్యదేవుడి సన్నిధిలో వివాహం చేసుకున్న జంటలతో పాటుగా వివిధ ప్రాంతాల్లో ఒక్కటైన నూతన జంటలు తమ బృందాలతో స్వామివారి సన్నిధిలో వ్రతాలు ఆచరించారు. శనివారం ఒక్కరోజు సుమారు 4వేల వ్రతాలు జరగ్గా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.50లక్షలు ఆదాయం సమకూరింది.

## 'ప్రసాద్ స్కీం' పనులకు టెక్నికల్ బిడ్‌లో ఆరుగురు

భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్‌స్కీం పనులకు దశాబ్దకాలంగా అవాంతరాలు ఎదురవుతున్నాయి. గతనెలలో టెండర్లు పిలిచి ఫైనల్‌చేసిన అనంతరం సింహాచలం దేవస్థానంలో చందనోత్సవ ఏర్పాట్లలో నిర్మాణంకూలి పలువురు మృతి చెందిన ఘటనలో అన్నవరం పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ అక్కడ గోడనిర్మించిన సంస్థ ఒక్కటే కావడంతో ప్రభుత్వం ఆ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. దీంతో టూరిజం అధికారులు షార్టుటెండర్ నోటిఫికేషన్ జారీచేశారు. శనివారం తెరిచిన టెక్నికల్ బిడ్‌లో ఆరుగురు గుత్తేదారులు టెండర్లలో పాల్గొన్నారని, ఫైనాన్స్ బిడ్‌ను తెరిచి టెండర్ల ఖరారు ప్రక్రియ పూర్తి చేస్తామని టూరిజంశాఖ అధికారులు తెలిపారు. ఫైనాన్స్‌బిడ్‌లు సోమవారం ఓపెన్ చేయనున్నట్టు వారు స్పష్టం చేశారు.

### అమలాపురంలో...

## నేడు పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

### ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో నిర్వహణ

అమలాపురం టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సర్‌సీవీ రామన్ స్కూలు ఆవరణలో ఆదివారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీలు నిర్వహిస్తున్నట్టు అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. మూడో పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి 130మందికి పైగా పవర్ లిఫ్టర్లు ఇప్పటికే తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. మెన్, ఉమెన్, మాస్టర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయి. 53 కిలోలు, 59, 66, 74, 83, 93, 105 కిలోలు, 105 కిలోలు పైబడిన విభాగాల్లో వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తామన్నారు. అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు.

### 5 నుంచి అప్పనపల్లి

## బాలబాలాజీ కల్యాణోత్సవాలు

### నేడు పందిరిరాట

మామిడికుదురు, మే 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అప్పనపల్లి బాలబాలాజీ వార్షిక కల్యాణోత్సవాలు జూన్ 5వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 25న ఆదివారం ఉదయం 11.30గంటలకు పందిరి రాట ముహూర్తం చేయిస్తున్నట్టు తెలిపారు. 5వ తేదీ గురువారం నుంచి 9వ తేదీ సోమవారం వరకు కల్యాణోత్సవాలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. భక్తులు స్వామి కల్యాణోత్సవాలను వీక్షించి ప్రసాదాలు స్వీకరించాలని సహాయ కమిషనర్ కోరారు.

### నేటి నుంచి వనువులమ్మ జాతర

కపిలేశ్వరపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): వాకతిప్పలోనున్న వనువులమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం అమ్మవారి జాతరతో పాటు గరగనృత్యాలు, విచిత్ర వేషాలు, డప్పువాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య వైభవంగా నిర్వహిస్తామన్నారు.

### ఇద్దరిపై పిచ్చి కుక్క దాడి

పి.గన్నవరం, మే 24(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం శివారు బొడపాటివారిపాలెంలో పిచ్చికుక్క స్వైర్య విహారం చేసి ఇద్దరిపై దాడి చేసింది. గ్రామానికి చెందిన సారిక నాగమణి, బండి వెంకటేశ్వరరావులపై దాడి చేసి గాయపర్చింది. నాగమణి సీహెచ్‌సీలో చికిత్స పొందుతోంది. రెండు నెలల క్రితం పశువులపై పిచ్చి కుక్క దాడికి పాల్పడింది.

# 11న సప్తనదీ జలాలతో మహా జ్యేష్ఠాభిషేకం


స్వామివారి సప్తనదీ జలాభిషేకంపై విలేకరులతో మాట్లాడుతున్న ఏసీ సత్యనారాయణ

అంతర్వేది, మే 24(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో జూన్ 11వ తేదీన జ్యేష్ఠా నక్షత్ర మహా పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీస్వామివారి మూలవరులకు సప్తనదీ జలాలతో మహాజ్యేష్ఠాభిషేకం నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అర్చకులు, వేదపండితులతో ఆలయ ఆచార సంప్రదాయానుసారంగా స్వామివారికి సప్తనదీ జలాలతో అభిషేకం చేసేందుకు ముహూర్తం నిర్ణయించారని ఆయన తెలిపారు. ఇప్పటికే సప్తనదీ జలాల సేకరణకు సిద్ధం చేశామని, స్వామివారి మహాజ్యేష్ఠాభిషేకం, మహాశాంతి హోమానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి తీర్థ ప్రసాదాలు అందుకోవాలని కోరారు. ఈసప్తనదీ జ్యేష్ఠాభిషేకంలో పాల్గొనే భక్తులు రూ.400 టిక్కెట్‌ను ఆలయం వద్ద కౌంటర్‌లో తీసుకుని స్వామివారి సంపూర్ణ అనుగ్రహం పొందాలని తెలిపారు. గంగా, యమునా, గోదావరి, సరస్వతి, నర్మదా, సింధు, కావేరి జలాలతో అభిషేక కార్యక్రమం ఉదయం 5.30నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతుంది. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ విజయసారథి, ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాసాచార్యులు, వేదపండితులు చింతా వెంకటశాస్త్రి, రమేషాచార్యులు పాల్గొన్నారు.

# లిఫ్ట్ ఇరిగేషన్‌తో ముంపునకు పరిష్కారం

**ఎమ్మెల్యే దేవ వరప్రసాద్**


కేశవదాసుపాలెం ముంపు సమస్యపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, మే 24(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో ముంపు ప్రాంతాల సమస్యకు పరిష్కారాలోచనలో భాగంగా కేశవదాసుపాలెంలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం గ్రామం మెండుపాలెం వద్ద ఇరిగేషన్ అధికారులు, తీర ప్రాంత సర్పంచ్‌లు, నాయకులతో ప్రత్యేక సమావేశమయ్యారు. ముందుగా ముంపు ప్రాంతాలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కార దిశగా అడుగు వేయాలని, ఇరిగేషన్, సర్పంచ్‌లను, స్థానిక రైతులను ఎమ్మెల్యే సూచించారు. ప్రధానంగా అంతర్వేది రాళ్లకాల్వ, గొంది నెవా డ్రెయిన్, పెదతిప్ప డ్రెయిన్, కేశనపల్లి, బట్టేలంక, కేశవదాసుపాలెం గ్రామాల్లో ముంపు నీటి సమస్యకు పరిష్కార మార్గాలను చూడాలన్నారు. ప్రస్తుతం కేశవదాసుపాలెం గ్రామం మెండుపాలెంలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. రాబోయే వర్షాలకు ముందుగానే ఈ ముంపు నీటి సమస్యకు పరిష్కారం చూపే విధంగా లిఫ్ట్ ఇరిగేషన్ సాయంతో సముద్రంలోకి ముంపు నీటిని మళ్లించాలనే ఆలోచనపై కసరత్తులు చేపట్టారు. డీఈ గురువాయ్‌తో చర్చించి లిఫ్ట్ ఇరిగేషన్ ఖర్చు, ప్రభుత్వ సాయం తదితర అంశాలపై చర్చించారు. రైతుల అభిప్రాయాలను తీసుకుని రైతులు, నీటిసంఘాలతో మాట్లాడి త్వరితగతిన ముంపుకు పరిష్కార మార్గాలను చూడాలని సూచించారు. అంతర్వేది పల్లిపాలెం, కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు గ్రామాలకు అనుకుని ఉన్న ఇతర గ్రామాల్లో వరి పంట, ఇప్పటికే సార్వా లేకపోవడం, దాళ్వా సాగు అంతంతమాత్రమే చేయడం రైతుల్లో నిరాశలు ఎదురయ్యాయని స్థానిక సర్పంచ్ కిశోర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు తెలిపారు. కార్యక్రమంలో గన్నవరం, రాజోలు నీటిసంఘ అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జి, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, సర్పంచ్‌లు, మేడిద సరోజ, పోతురాజు కిశోర్, కొండా జాన్‌బాబు, గుబ్బల ఫణికుమార్, యెనుముల సింహాచలం, ఇరిగేషన్ అధికారులు, కూటమి శ్రేణులు, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

# వర్షాలతో రోడ్లు అధ్వానం.. ప్రయాణికుల అవస్థలు


అయినవిల్లి: కె.జగన్నాథపురంలో రహదారి


ఐ.పోలవరం: కేశనకుర్రు ఏటిగట్టు రోడ్డు


అంబాజీపేట: వ్యాఘ్రేశ్వరం రహదారి

- ప్రయాణికులు, ప్రజలకు కష్టాలు
- అభివృద్ధి చేయాలని వినతి

అయినవిల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం-కె.జగన్నాథపురం రోడ్డు చెరువును తలపిస్తుంది. చినుకు పడితే రహదారి అధ్వానంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ పాలనలో రహరి చిద్రమైనా పట్టించుకోలేదు. రెండు ప్రధాన జాతీయ హైవేలను కలిపే ఈమార్గం ప్రయాణించడానికి అనువుగా లేకపోవడంతో వాహన ప్రయాణాలు జరుగుతున్నాయని, వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా తక్షణం రహదారి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

### కేశనకుర్రు రోడ్డు గుంతలమయం

ఐ.పోలవరం, మే 24(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు అస్థవ్యస్థంగా తయారవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కేశనకుర్రు ఏటిగట్టు రోడ్డు గుంతలమయం కావడంతో వర్షానికి నీరు నిలిచిపోయి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయాల్లో వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు డ్రైన్లు పొంగి మురుగునీరు రోడ్లపై చేరడంతో రహదారులు ఛిద్రమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం నీరు దిగే మార్గంలేక రోజుల తరబడి రహదారులు నీటిలోనే ఉంటున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీల్లో నీరు నిలిచిపోవడంతో అక్కడ నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### వ్యాఘ్రేశ్వరం రహదారి అధ్వానం

### ప్రయాణం నరకప్రాయం

అంబాజీపేట, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లేటికుర్రు పరిధిలోని బాబానగర్ నుంచి వ్యాఘ్రేశ్వరం వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షానికి ఈరహదారిలో ఉన్న గోతుల్లో నీరు చేరి ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. నిత్యం ఈరహదారిపై వేలాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నాబార్డు పథకంలో భాగంగా ఆర్‌డీఎఫ్ నిధులతో కొంత మేర సీసీ రోడ్డు నిర్మించి మిగిలినది బీటీ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు ఈరహదారిలో భారీ గోతులు పడి ప్రయాణిలకు ఇబ్బందిగా మారింది. ఈగోతుల్లో ప్రయాణికులు పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఈరహదారిని నిర్మించాలని స్థానికులు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎన్ఎస్ఎన్ వర్మ కోరుతున్నాడు.

# పైప్‌లైన్‌కు తవ్వి.. రోడ్డు అధ్వానంగా వదిలేసి


యానాం వైఎస్ఆర్ విగ్రహం వద్ద రోడ్డు అధ్వానం

- అభివృద్ధి చేయాలని వినతి

యానాం, మే 24(ఆంధ్రజ్యోతి): యానాం-ద్రాక్షారామ రోడ్డులో స్థానిక నల్ల చెరువు వైఎస్ఆర్ విగ్రహం నుంచి అర కిలో మీటరు రహదారి అధ్వానంగా ఉంది. ఇటీవల వైఎస్ఆర్ విగ్రహం వద్ద పైప్‌లైన్ పనుల కోసం రోడ్డును తవ్వారు. అయితే పైప్‌లైన్ పనులు పూర్తయిన తర్వాత రోడ్డును పూర్తిగా పటిష్ఠం చేయకుండా మట్టితో పూడ్చారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడ బురదతో అధ్వానంగా ఉంది. బురదతో గోతులమయంగా అర కిలో మీటరు రహదారి తయారైంది. దీంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈమార్గం యానానికి ప్రధాన ద్వారం కావడంతో ప్రతీ రోజు బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు వస్తుంటాయి. అర కిలో మీటరు రహదారిని పటిష్ఠం చేయాలని బీజేపీ యానాం శాఖ అధ్యక్షుడు కనకాల రాజు డిమాండ్ చేశారు. స్థానిక ప్రముఖులు, వ్యాపారస్తులు పోలశెట్టి గంగన్న, కోన వీరబాబు, కనకాల గోపీ, ధూళిపూడి సతీష్ తదితరలు పరిపాలనాధికారి మునిస్వామి, ప్రజాపనులుశాఖ అధికారులను కలిసి రోడ్డు పరిస్థితిని వివరించారు. తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎమ్మెల్యే, ప్రభుత్వానికి డీలర్ల కృతజ్ఞతలు


రాజోలు ఎమ్మెల్యే దేవను కలిసిన డీలర్లు

- రేషన్ షాపుల ద్వార్వా నిత్యావసరాల పంపిణీపై హర్షం

మలికిపురం/మామిడికుదురు, మే 24(ఆంధ్రజ్యోతి): జూన్ 1 నుంచి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీకి ప్రభుత్వం ప్రకటించడంతో రాజోలు నియోజకవర్గంలోని చౌక డిపో డీలర్ల ప్రతినిధులు శనివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పోరాటం చేయగా కూటమి ప్రభుత్వం తమకు మద్దతుగా రాష్ట్రంలో 29వేల డీలర్ల జీవితాలకు వెలుగు నింపిందని ఈసందర్భంగా డీలర్లు కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, పౌరసరఫరాలశాఖ మంత్రి నాందెడ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం మీపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ప్రజల సేవలో మరింత మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో కేవీఎస్ ప్రసాద్, మోకా చంద్రరాజు, గుబ్బల రామారావు, కుంచే శ్రీను, పెద్దిరాజు, ప్రసాద్, మలికిపురం, మామిడికుదురు, సఖినేటిపల్లి, రాజోలు మండలాల డీలర్లు పాల్గొన్నారు.

### పేదలను ఆదుకోవడమే లక్ష్యం

మలికిపురం, మే 24(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 19మంది లబ్ధిదారులకు రూ.14.31లక్షల చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 250 మందికి రూ.2.50కోట్లు సీఎం సహాయనిధి ద్వారా అందించామన్నారు. రాజోలు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుకు నడిపించడమే తన లక్ష్యమన్నారు.

### లక్కవరంలో వాకర్స్ క్లబ్ ఏర్పాటు

మలికిపురం, మే 24(ఆంధ్రజ్యోతి): లక్కవరంలో వాకర్స్ క్లబ్‌ను శనివారం వాకర్స్ 103 జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు జల్లి సుజాత శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రజలకు నడక, యోగా, సైక్లింగ్ తదితర వ్యాయామ పద్ధతులతో ఆరోగ్య సాధనపై నిరంతరం అవగాహన కలిగేలా విస్తృత ప్రచారం, చైతన్యం కల్పించాలన్నారు. మంగెన నరసింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శృంగవరపు వేణుగోపాలరావు, గుబ్బల రమేష్ అధ్యక్ష, కార్యదర్శులుగా, దొడ్డా వెంకటేశ్వరరావును కోశాధికారిగా నియమించారు. గౌరవాధ్యక్షుడిగా మంగెన వెంకటనరసింహారావు, గౌరవ సలహాదారులుగా గుబ్బల బాబ్జి, బోనం సాయిరామ్‌లను నియమించారు. కార్యక్రమంలో మంగెన భూదేవి, బళ్ల ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యేక అవసరాలు గల వారికి ట్రైసైకిళ్లు

**ఎంపీడీవో కేవీ ప్రసాద్**

**త్వరలో ఎమ్మెల్యే ద్వారా పంపిణీ**

పి.గన్నవరం, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రత్యేక అవసరాలు గల వారికి 21 ట్రైసైకిళ్లు మండల పరిషత్‌కు వచ్చినట్లు ఎంపీడీవో కేవీ ప్రసాద్ తెలిపారు. ఇటీవల మండలానికి చెందిన పలువురు ప్రత్యేక అవసరాలు గల వారు అమలాపురం, రాజోలు, రావులపాలెంలలో జరిగిన ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. ఇంటర్వ్యూలో అర్హత పొందిన లబ్ధిదారులకు ఓఎన్జీసీ సౌజన్యంతో అలిమ్‌కో (ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సంస్థ ద్వారా ఒక బ్యాటరీ మోటార్ సైకిల్, 20 ట్రైసైకిళ్ల, వినికిడి యంత్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈయంత్రాలను త్వరలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ లబ్ధిదారులకు అందిస్తారని ఆయన తెలిపారు.

# బాలబాలాజీ స్వామికి విశేష పూజలు




బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, మే 24(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం పురస్కరించుకుని అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శనివారం సందర్భంగా స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. వేకువజామునే వేదమంత్రోచ్చారణల మధ్య సుప్రభాత సేవ జరిపి తొలి హారతి ఇచ్చారు. దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని శనివారం 5500మంది దర్శించుకుని దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకంలో 3వేల మంది అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,49,554 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

### పంటబోదెలోకి దూసుకెళ్లిన టిప్పర్

పి.గన్నవరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మొండెపులంక ప్రధాన రహదారి చెంతన పంటబోదెలోకి టిప్పర్ లారీ దూసుకుపోయింది. పంగిడి నుంచి రాజోలుకు కంకర లోడుతో వస్తున్న టిప్పర్ లారీ మొండెపులంక వద్ద అదుపుతప్పి పంటబోదెలోకి దూసుకుపోయింది. డోర్ తీసుకుని డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.




### ముమ్మిడివరంలో భారీ వర్షం


వర్షానికి నీట మునిగిన వీధులు

ముమ్మిడివరం, మే 24(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతంలోని రోడ్లు, కాలనీలు నీట మునుగుతున్నాయి. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కుండపోతగా వర్షం కురిసింది. ముమ్మిడివరంలోని ఆసుపత్రుల వీధి, కుమ్మర్లవీధి, ఆర్టీసీ బస్టాండు రోడ్డులతో పాటు పలు రోడ్లు వర్షం నీటిలో మునిగాయి. వర్షం కుండపోతగా కురవడంతో జనజీవనం స్తంభించింది. శనివారం ఉదయం ఆకాశం తెరిపివ్వడంతో అక్కడక్కడా కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు ఎగుమతిచేసే పనులకు రైతులు ఉపక్రమించారు. మధ్యాహ్నం నుంచి ఆకస్మికంగా వాతావరణంలో మార్పులు వచ్చి వర్షం కురవడంతో ధాన్యం రవాణా పనులకు అంతరాయం ఏర్పడింది.

### అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



మునిపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు, వైసీపీ ఇన్‌చార్జి పినిపే శ్రీకాంత్

ఉప్పలగుప్తం, మే 24(ఆంధ్రజ్యోతి): మునిపల్లిలో మండల ప్రజాపరిషత్ వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పినిపే శ్రీకాంత్ ఆవిష్కరించారు. యువత అంబేడ్కర్ ఆశయ సాధనకు శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యర్రంశెట్టి రామచంద్రరావు, నల్లా బాబండి, పెయ్యల రాజ్‌కుమార్, కడిమి చిన్నవరాజు,జడ్పీటీసీ గెద్దం సంపదరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, ఎంపీటీసీలు వంగా గిరిజానాగకుమారి, నిమ్మకాయల రాము, పెట్టా అప్పారావు, వైసీపీ నాయకులు చెల్లిబోయిన శ్రీనివాసరావు, కుంచే రమణారావు, నిమ్మకాయల హనుమంతశ్రీనివాసరావు, చీకట్ల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవీఎస్ రాజు జన్మదిన వేడుకలు


రాజోలు, మే 24(ఆంధ్రజ్యోతి): చింతలపల్లిలో మాజీ డిప్యూటీ స్పీకర్ అల్లూరి వెంకటసూర్యనారాయణరాజు పుట్టినరోజు వేడుకలు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం ఆయన స్వగృహం వద్ద ఘనంగా నిర్వహించారు. అభిమానులు ఏర్పాటుచేసిన కేక్‌ను ఆయన కట్‌చేసి అందరికీ పంచారు. ప్రాజెక్టు మాజీ చైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజువర్మ ఆయనకు కేక్ తినిపించారు. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జగడం సత్యనారాయణ, చాగంటి స్వామి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, పిప్పళ్ల రాంబాబు, అడబాల సాయిబాబు, ఆచంట శ్రీనివాస్, యాలంగి రమేష్, మోకా పార్వతి, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, అనుచూరి పురుషోత్తం, అడబాల చంటి, గెద్దం సింహా, రుద్రరాజు బంగార్రాజు, చెల్లింగి అబ్బులు, తాడి సత్యనారాయణ, అప్పారి వెంకటేశ్వరరావు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### టీడీపీ మండలశాఖ అధ్యక్షుడిగా సాయిబాబా



అమలాపురం రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ అమలాపురం మండల అధ్యక్షుడిగా సాకుర్రు గ్రామానికి చెందిన చొల్లంగి సత్యసాయిబాబాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అమలాపురంలోని టీడీపీ కార్యాలయం వద్ద శనివారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో మండలశాఖ కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. సాయిబాబా పేరును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ప్రతిపాదించగా రాష్ట్ర కార్యదర్శి, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి బలపరిచారు. మండలశాఖ ప్రధాన కార్యదర్శిగా పేరూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ దేవరపల్లి వీరేష్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలశాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన సాయిబాబా పంచాయతీరాజ్ శాఖలో సుదీర్ఘకాలం ఉద్యోగంచేసి ఉద్యోగ విరమణ అనంతరం టీడీపీలో చేరారు. ఆయన సాకుర్రు గ్రామ సర్పంచ్‌గా గతంలో పనిచేశారు. నూతన కార్యవర్గాన్ని నాయకులు పొలమూరి ధర్మపాల్, పిచ్చిక శ్యామ్, కొండా సత్యనారాయణరాజు, ఏకుల విజయ్ అభినందించారు.

### టీడీపీ కాట్రేనికోన అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



కాట్రేనికోన, మే 24(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా సానబోయిన వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా చెల్లూరి సుభాష్, ఉపాధ్యక్షుడిగా ముదే నాగరాజు ఎన్నికయ్యారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో వాసంశెట్టి రాజేశ్వరరావు, విత్తనాల బుజ్జి, పచ్చిమట్ల సూర్యనారాయణరాజు, రేవు రమేష్, మాదే యోగీశ్వరి, సత్తాల ప్రసాద్, గెద్దాడ శ్రీను, గుబ్బల చంద్రరావు, కాలాడి నాగేశ్వరరావు, జగడం విజయకుమార్, ఓలేటి శ్రీను, కర్రి సత్తిబాబు, రాగుర్తి వెంకటరమణ, కాశి వెంకటరమణ పాల్గొన్నారు.

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట, మే 24(ఆంధ్రజ్యోతి):యోగాతో మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో భీమరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, వైస్ఎంపీపీ నేతల నాగరాజు, ఏపీవో అడపా వెంకటకృష్ణ, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా స్వామివారి శాంతి కల్యాణం

అంతర్వేది, మే 24(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో బహుళ ద్వాదశిని పురస్కరించుకుని శనివారం స్వామి-అమ్మవారికి శాంతి కల్యాణం నిర్వహించారు. తొలుత స్వామి-అమ్మవార్లను ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద ప్రత్యేక సింహాసనంపై ఆశీనులుచేసి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, పాణిగ్రహనం, మాంగళ్యధారణ నిర్వహించారు. భక్తుల గోవింద నృసింహనామాల మధ్య కల్యాణ తంతును అర్చకులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### జాబ్‌మేళాలో 89మంది ఎంపిక

ముమ్మిడివరం, మే 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 89మంది అర్హత సాధించారు. ఈజాబ్‌మేళాలో 11 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాకు 185మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకాగా వారిలో 89 మందిని ఎంపికచేసినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి వసంతలక్ష్మి, జిల్లా స్కిల్ డెవలెప్మెంట్, ప్లేస్‌మెంట్ అధికారి కె.రాజేంద్రప్రసాద్, వికాస డిస్ట్రిక్ట్ మేనేజర్ రమేష్, స్కిల్ డెవలప్మెంట్, సిడాప్ ఉద్యోగులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం, మే 24(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్డీఎస్ఎస్ వర్క్ నిమిత్తం 11కేవీ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా ఉండదని అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఈ కారణంగా ఆదివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉప్పలగుప్తం, గొల్లవిల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

### ఘనంగా పల్లాలమ్మ జాతర

మామిడికుదురు, మే 24(ఆంధ్రజ్యోతి): మొగలికుదురు గ్రామదేవత శ్రీపల్లాలమ్మవారి జాతరను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా బాజాభజంత్రీలు, డోలు సన్నాయి ప్రాంతాల డ్యాన్సులు, బెంగాలీ తంబోలా డప్పులు, గరగ నృత్యాలు, మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ వైభవంగా చేశారు. 26వ తేదీ సోమవారం భక్తులు అమ్మవారికి చలిమిడి, పానకాలు, నైవేద్యాలు, తీర్థం జరుగుతుందని కమిటీవారు తెలిపారు. 30వ తేదీ శుక్రవారం ఉదయం 10గంటల నుంచి అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరుగుతుందని ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీవారు కోరారు.

### వెంకటేశ్వరా కళాశాల విద్యార్థుల ప్రతిభ

అమలాపురం టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల్లో అమలాపురం శ్రీ వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించినట్టు కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు తెలిపారు. ఎం.కౌశల్య, బి.చాందినీ 9.8 గ్రేడ్ పాయింట్లు సాధించగా జీహెచ్ తులసి 9.3, ఎ.సుస్మిత 9.1 గ్రేడ్ పాయింట్లు సాధించారు. ఎస్వీ దుర్గా, సీహెచ్ ఇంద్రాణీ, ఎల్.కుమార్, వి.నూకాంబికతో పాటు 45 మంది విద్యార్థులు 9.0 గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ కేవీఎస్‌వీఎన్ మనోహర్, ఏవో కరాటం ప్రవీణ్, వై.వరప్రసాద్, కె.శ్రావణ్‌దిలీప్, ఎం.విజయలక్ష్మి, సీలి సంసోను తదితరులు అభినందించారు.


యశ్వంత్‌భీమారావుఅంబేడ్కర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, గబ్బర్‌సింగ్

పల్లంకుర్రు బస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం అంబేడ్కర్ మనుమడు యశ్వంత్‌భీమారావు ఆవిష్కరించారు. -/ కాట్రేనికోన

### గోదావరి పుష్కరాలను విజయవంతం చేయండి

అంబాజీపేట, మే 24(ఆంధ్రజ్యోతి): 2027లోజరిగే గోదావరి పుష్కరాల విజయవంతానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఇన్ చార్జ్ ఎంపీడీవో భీమారావు కోరారు. పుష్కరాల నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ, సర్పంచ్, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలంలో గోదావరి నదీతీరాన ఉన్న తొండవరం, వాకలగరువు పుష్కర ఘాట్లతో పాటు గ్రామాల్లో ఉన్న ఘాట్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఘాట్లకు వెళ్లేందుకు రహదారులు, వసతులు, టాయిలెట్స్, తాగునీరు ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. సమావేశంలో జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీలు వాకపల్లి దొరబాబు, వడలి కృష్ణమూర్తి, పబ్బినీడి రాంబాబు, విద్యుత్ శాఖ ఎఈ కె.మోహన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

### అన్నవరంలో ఎమ్మెల్యే బండారు పూజలు

కొత్తపేట, మే 24(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో శనివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశా రు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

# మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



శనేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

## కిక్కిరిసిన మందపల్లి ఆలయం

### స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.8.22 లక్షలు

కొత్తపేట, మే 24(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనిత్రయోదశి సందర్భంగా శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.8,22,893 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



మండల పరిషత్ కార్యాలయంలో ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

## విద్యాశాఖ కార్యాలయానికి నిధులు మంజూరు

ఆత్రేయపురం, మే 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో నాలుగు దశాబ్దాల కల సాకారం కానుంది. మండల విద్యాశాఖ కార్యాలయానికి సొంతగూడు లభించనుంది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంఆర్సీ భవన నిర్మాణానికి 2003లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నేటి వరకు భవన నిర్మాణానికి నోచుకోలేదు. ఆయన హయాంలో నిలిచిపోయిన విద్యాశాఖ కార్యాలయ భవనానికి రూ.53 లక్షల నిధులు మంజూరు చేశారు. నాలుగు దశాబ్దాల నుంచి ఎంపీడీవో కార్యాలయంలోనే కొనసాగించారు. త్వరలో భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేయనున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గతంలో శంకుస్థాపన జరిపిన స్థలంలోనే కార్యాలయ భవన నిర్మాణాన్ని చేపట్టనున్నారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది అభినందించారు.

## ఉపాధ్యాయుల బదిలీ సేవలకు పీఆర్‌టీయూ నెట్ సెంటర్

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి సేవలు అందించేందుకు పీఆర్‌టీయు ఆధ్వర్యంలో పట్టణంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసినట్టు పీఆర్‌టీయు జిల్లా అధ్య క్షుడు నరాల కృష్ణకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అమృతరావు తెలిపారు. పాత బస్టాండు సెంటర్‌లో ఏపీఎన్‌జీవో హోమ్‌లో నెట్ సెంటర్ ఏర్పాటు చేసి బదిలీలకు దరఖాస్తు చేసేవారికి సేవలు అందిస్తున్నట్లు వారు తెలిపారు. మండల అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కొత్తూరి భీమశంకరం, ఓదూరి వెంకటరమణ, కడియాల గోవిందరాజు, డి.రామదుర్గారావు, బళ్ల దమరుకనాథం, సీపీఎస్ కన్వీనర్ పంపన సురేష్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.



పీఆర్‌టీయు ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల బదిలీ సేవా కేంద్రం



మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్ష చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

## సమస్యలు పరిష్కరించే వరకు పోరాడతాం

మండపేట, మే, 24(ఆంధ్రజ్యోతి) మున్సిపల్ విభాగంలో కొన్నేళ్ల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ వారు సమ్మెబాట పట్టారు. మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం వారు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కాంట్రాక్ట్ కార్మిక సంఘ అధ్యక్షుడు పాలపర్తి సుబ్బరాజు నేతృత్వంలో కార్మికులు తమ సమస్యలు పరిష్కరించి ఉద్యోగ భద్రతను కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలన్నారు. ఈ దీక్షల్లో కాంట్రాక్ట్ కార్మికులు కప్పల సురేంద్ర, పాలపర్తి సురేష్, పిట్టా ప్రవీణ్ , గంటి నవీన్‌కుమార్, కె.రాజు, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## హత్యకు వివాహేతర సంబంధమా ? దొంగతనమా ?

• ఆటో డ్రైవర్ హత్య కేసులో సంచలన విషయాలు

• ఇద్దరి అరెస్ట్.. వివరాలు వెల్లడించిన డీఎస్పీ జయసూర్య

భీమవరం క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి) : తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న అనుమానం, అదేవిధంగా తన ఇంట్లో దొంగతనం చేశాడన్న ఆరోపణలతో ఆటో డ్రైవర్ హత్య జరిగినట్లుగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. స్థానిక చినరంగనిపాలెంలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ కాటూరి దుర్గారావు భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బొమ్మల వ్యాపారి, ఆటో డ్రైవర్ ఎల్లా కోటేశ్వరరావు(బాబి)తో రెండేళ్ల క్రితం పరిచయమైంది. అనంతరం దుర్గారావు.. బాబి వద్ద ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 4న దుర్గారావు తన సోదరుడు నివాసం వద్ద ఉండగా ఎల్లా బాబి, తన కుమారుడు వెళ్లి దుర్గారావుపై దొంగతనం నేరం మోపారు. అనంతరం వారి ఇంటికి తీసుకువెళ్లి బాబి అతని భార్య షేక్‌మేరి, తన కుమారుడు కలిసి అతడిని ఇనుపరాడ్డు, సుత్తితో కొట్టి దాడి చేశారు. అనంతరం అతడి కాళ్లు, చేతులు కట్టి, నోటిలో గుడ్డలు కుక్కి ఒక సంచిలో కట్టారు. ఆటోలో వేసుకుని ముగ్గురూ కలిసి బాబి స్వగ్రామమైన అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం వెదిరేశ్వరం తీసుకువెళ్ళేందుకు ప్రయత్నించారు. మార్గమధ్యలో అతడు కదులుతూ ఉండడంతో మళ్లీ గట్టిగా సంచిని ఆటో కేసి కొట్టడంతో మృతి చెందాడు. అక్కడ నుంచి వెదిరేశ్వరం తీసుకువెళ్లి మృతదేహాన్ని సంచిలో నుంచి బయటకు తీసి మరో చిన్న సంచిలో మూటకట్టి ద్విచక్ర వాహనంపై బాబి, అతని కుమారుడు అంబేడ్కర్ కోనసీమ జిల్లా జొన్నాడ గ్రామంలోని కోటిపల్లి కాలువలో పడవేసి ఇంటికి వచ్చేశారు. ఈనెల 21న మృతుడు సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు బాబి, అతని భార్య మేరీని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. మృతదేహాన్ని కాలువలో పడవేసినట్లుగా చెప్పడంతో కాలువలో జాలర్ల సహాయంతో ఈనెల 23న మృతదేహాన్ని బయటకు తీశారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ కేసులో ఎల్లా కోటేశ్వరరావు (బాబి), అతని భార్య షేక్ మేరీని అరెస్ట్ చేసి వారి వద్ద సుత్తి, ఇనుపరాడ్డు, సంచిని స్వాధీనం చేసుకున్నట్లుగా డీఎస్పీ తెలిపారు. కుమారుడు పరారీలో ఉన్నాడని తెలిపారు. సీఐ ఎన్.నాగరాజు, ఎస్ఐ కృష్ణాజీ, సిబ్బంది ఉన్నారు.

## టీడీపీ నూతన కార్యవర్గానికి సత్కారం

ఆలమూరు, మే 24(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండల తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గ నాయకులను శనివారం సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడిగా నిమితులైన ఈదల సత్తిబాబు, కార్యదర్శి సలాది నాగేశ్వరరావు, ఆలమూరు గ్రామ అధ్యక్షుడు ఈదల రాంబాబులను మడికి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అడ్డాల సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న నాయకులు



### అన్నవరంలో ఎమ్మెల్యే బండారు ప్రత్యేక పూజలు

కొత్తపేట, మే 24(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో శనివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా చైర్మన్ రోహిత్ స్వామివారి మెమెంటో ప్రసాదం అందజేశారు.

### లెదర్ ఫుట్‌వేర్ శిక్షణకు దరఖాస్తులు అందజేయండి

ద్రాక్షారామ, మే 24(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలంలో 25 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లెదర్ ఫుట్‌వేర్ శిక్షణకు ఆసక్తిగల ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కడలి పద్మజ్యోతి తెలిపారు. ఎల్‌డీఎంఈఎస్ శిక్షణ కేంద్రం, నర్సీపట్టణంలో శిక్షణ పొందడానికి దరఖాస్తులు గ్రామ సచివాలయాల్లో సంక్షేమ కార్యదర్శులకు అందచేయాలని కోరారు. టెన్త్ ఉత్తీర్ణత, 19 నుంచి 35 ఏళ్ల వయస్సుగల ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తారని శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తారని ఆమె తెలిపారు. టెన్త్ మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, 4 పాసుపోర్టు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



ప్రత్యేక అలంకరణలో వనువులమ్మ

### నేటి నుంచి వనువులమ్మ జాతర ఉత్సవాలు ప్రారంభం

కపిలేశ్వరపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): వాకతిప్పలోనున్న వనువులమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం అమ్మవారి జాతరతో పాటు గరగనృత్యాలు, విచిత్రవేషాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య వైభవంగా నిర్వహిస్తామన్నారు. సోమవారం అమ్మవారి ఆలయం వద్ద తీర్థం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



దివంగత రంగ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, మాజీ ఎమ్మెల్యే రాధ

### రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

ఆత్రేయపురం, మే 24(ఆంధ్రజ్యోతి): దివంగత వంగవీటి మోహనరంగ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, విజయవాడ మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధ పేర్కొన్నారు. శనివారం రాత్రి తాడిపూడిలో రంగా విగ్రహాన్ని నెలకొల్పారు. రంగా విగ్రహాన్ని ఆయన తనయుడు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల హృదయాల్లో రంగా నిలిచిపోయారన్నారు. కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ రంగా చిరస్మరణీయుడయ్యారన్నారు. తొలుత రాధా, బండారులను ఆత్రేయపురం రేవు నుంచి రంగా అభిమానులు తాడిపూడి వరకు ఊరేగింపుగా బైక్ ర్యాలీగా తీసుకునివచ్చారు. బాణసంచా కాల్పులు, పూలవర్షం మధ్య రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రంగా అభిమానులు, కాపు యువత, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### జగ్గిరెడ్డి నివాసంలో వైసీపీ నాయకుల సమావేశం

రావులపాలెం, మే 24(ఆంధ్రజ్యోతి): గోపాలపురంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి నివాసంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని నియోజకవర్గ కోఆర్డినేటర్ల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలను చర్చించినట్లు తెలిసింది. కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ కోఆర్డినేటర్ పినిపే విశ్వరూప్, పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మండపేట, రాజోలు, అమలాపురం, రామచంద్రపురం, పి.గన్నవరం, ముమ్మిడివరం కోఆర్డినేటర్లు తోట త్రిమూర్తులు, గొల్లపల్లి సూర్యారావు, పినిపే శ్రీకాంత్, పిల్లి సూర్యప్రకాశ్, గన్నవరపు శ్రీనివాసరావు, పొన్నాడ సతీష్, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం, మే 24(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఆదివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు ఉప్పలగుప్తం, గొల్లవిల్లి ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామివారు. పక్క చిత్రంలో ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

## వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

### స్వామివారి ఆదాయం రూ.55.33 లక్షలు

ఆత్రేయపురం, మే 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధులలో ఏడు ప్రదక్షిణలు చేసి మొ క్కులు చెల్లించారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కా నుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరంరాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.55.33 లక్ష లు వచ్చినట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వానను సైతం లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వానలో తడిసి స్వామివారి ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే లొల్ల లాకులవద్ద శనివారం గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది. లొల్ల వద్ద సైఫాన్ నిర్మాణ పనులు వేగంగా రూపొందించడంతో ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇరుకుగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వెంకన్న ఆలయానికి వేలాదిగా భక్తులు రావడంతో లొల్లలాకుల వద్ద ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



లొల్ల లాకుల వద్ద స్తంభించిన ట్రాఫిక్



సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

## పేదల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట, మే 24(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుంటారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం వాడపాలెం పార్టీ కార్యాలయం వద్ద సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను 15 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాలూరి సత్యానందం, బూసి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

**రేషన్ డీలర్ల హర్షం:** రేషన్ వాహనాలను రద్దు చేయడంపై రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నల్లం బాల, బొరుసు వీరభద్రరావు, పాలంగి డేవియల్, బండారు సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

### ఘనంగా స్వామివారి శాంతి కల్యాణం

అంతర్వేది, మే 24(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బహుళ ద్వాదశిని పురస్కరించుకుని శనివారం స్వామి, అమ్మవారికి శాంతి కల్యాణం నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లను ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు చేసి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పాణిగ్రహణం, మాంగల్యధారణ నిర్వహించారు. భక్తుల గోవింద నృసింహనామాల మధ్య కల్యాణ తంతును అర్చకులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## మెట్ట ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### కేశవరంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల శ్రీకారం

మండపేట, మే, 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. కేశవరం గ్రామాభివృద్ధికి సహకరిస్తానని ఆయన అన్నారు. శనివారం గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ, శంకుస్థాపనలు చేశారు. గ్రామంలో చేపట్టే 8 రోడ్డు పనులను ఎమ్మెల్యే వేగుళ్లతో పాటు స్థానిక నేతలు శంకుస్థాపనలు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అనంతరం గ్రామంలో వున్న ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న సేవలపై ఆయన ఆరా తీశారు. పాడి రైతులకు పశువుల దాణాను అందజేశారు. ఆయన వెంట స్థానిక నేతలు ఉండమట్ల రామారావు, ఉండమట్ల శ్రీను, సర్పంచ్ పి.సత్తిబాబు, ఎంపీటీసీ ఎ.కృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, కె.శ్రీనువాసరావు, తదితరులతోపాటు, పంచాయతీ కార్యదర్శి ఎన్.సుబ్బారావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

**డ్రైన్‌లో పూడికతీత పనులకు శ్రీకారం:** అర్తమూరు గ్రామంలో మామిడిబాడవ మైనర్ డ్రైన్‌కు సంబంధించి పూడికతీత పనులను ఎమ్మెల్యే వేగుళ్ల శనివారం ప్రారంభించారు. రూ. 3.16 లక్షలతో చేపట్టే పనుల వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ వ్యవస్థను నాశనం చేసిందని ఆయన ఆరోపించారు. సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో జరిగే పనులను ఇరిగేషన్ అధికారులతోపాటు, స్థానిక ఆయకట్టు రైతులు కూడా వాటిని పర్యవేక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలతో పాటు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, సాగునీటి సంఘ అధ్యక్షుడు మల్లిడి సత్తిరాజు, పి.సుబ్బారెడ్డి, పి.రామకృష్ణారెడ్డి, చిర్ల చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేశవరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

### టీడీపీ మండల అధ్యక్షుడిగా బలవరెడ్డి ఎంపిక



టీడీపీ మండల అధ్యక్షుడిగా ఎంపికైన బలవరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండల టీడీపీ అధ్యక్షులుగా గ్రామానికి చెందిన బలవరెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు) ఎంపికైనట్లు అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా దానేటి భాస్కర్, ఉపాధ్యక్షులుగా రంకిరెడ్డి వెంకటేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా చింతపల్లి బాలకృష్ణ, నందికోళ్ళ మంగరాజు, కార్యదర్శిగా బక్కి సుజాత, గొల్లపల్లి భవాని, గుత్తుల జగదాంబేశ్వరి, కోశాధికారిగా పలివెల సూరయ్య(లాజరు) లు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులుగా ఎంపికైన బలవరెడ్డిని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కష్టపడే వారికి టీడీపీలో గుర్తింపు తథ్యం

కపిలేశ్వరపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): కష్టించి పనిచేసే వారిని గుర్తించేది తెలుగుదేశం పార్టీ మాత్రమే అని రాష్ట్ర తెలుగు యువత సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొప్పిశెట్టి వాసు అన్నారు. శనివారం కపిలేశ్వరపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీకి రెండు దశాబ్దాలుగా సేవలందిస్తూ ఎమ్మెల్యేగా వేగుళ్ళ జోగేశ్వరరావు గెలుపు కోసం విశేష కృషి చేసిన వ్యక్తి బలవరెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు) అన్నారు. అలాంటి వ్యక్తిని టీడీపీ మండల అధ్యక్షుడిగా నియమించి సముచిత స్థానం కల్పించడం ఇందుకు నిదర్శనమన్నారు. దీనికి ఎంపిక చేసిన ఎమ్మెల్యే వేగుళ్లకు, నియోజకవర్గ పెద్దలకు వాసు కృతజ్ఞతలు తెలిపారు.



చినకోరుమిల్లిలో కాటన్‌దొర విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

### కాటన్‌దొర విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం

కపిలేశ్వరపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకోరుమిల్లి గోదావరి నదీతీరాన ఏటిగట్టుపై సర్‌ఆర్థర్ కాటన్‌దొర విగ్రహాన్ని రిటైర్డ్ హెచ్‌ఎం చిక్కం సూర్యనారాయణ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. శనివారం ఆయన కాటన్‌దొర విగ్రహానికి నివాళులర్పించారు. ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు కాటన్‌దొర అని ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, మాకా బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.